క్లుప్తంగా

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

పెదకాకాని:స్థానిక లూథర్‌గిరి కాలనీలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కథలు చెప్పడం, రాయడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, మోటివేషన్ క్లాస్సు, యోగా, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్రామా అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. చెస్, క్యారమ్స్ ఆటల్ని నేర్పిస్తామని తెలిపారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తనకు అర్జీలు అందజేయవచ్చని తెలియజేశారు.

హ్యాపీగా ప్రపంచ నవ్వుల దినోత్సవం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు లాల్ వజీర్ ఆధ్వర్యంలో సభ్యులు రోడ్డుపై నవ్వులతో ప్రదర్శన చేశారు. అనంతరం సీనియర్ సభ్యురాలు సంధ్యను సన్మానించారు. కార్యక్రమంలో చెలికాని సీతారామయ్య, శివరాం ప్రసాద్, లక్ష్మి, కమల, ప్రసన్న, శౌరయ్య, బ్రహ్మానంద రెడ్డి, సుజాత, కృష్ణవేణి, జయమ్మ, శ్రీనివాస్, పుష్ప పాల్గొన్నారు.

అల్లూరి జీవితం యువతకు ఆదర్శనీయం



గుంటూరు మెడికల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఆదర్శనీయమని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక నాజ్ సెంటర్ శనక్కాయల అంకమ్మ నాయుడు ఐలాండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు అనుమోలు ఏడుకొండలు, పోతురాజు వెంకట్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, మోతే శేషగిరి, మలిశెట్టి పవన్, పద్మనాభం, తిరువళ్లూరి రమణ, ఊరుబండి కృష్ణమూర్తి, దేవిశెట్టి బాబూరావు, దినేష్‌జైన్, షేక్ రఫీ పాల్గొన్నారు.

అలరించిన భక్తి గానలహరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా స్వరరాగ సుధా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భక్తి గానలహరి నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సంస్థ నిర్వాహకులు కె.వి.సాయిబాబశర్మ, కృష్ణకుమారి బృందం అనేక సంకీర్తనల్ని ఆలపించి భక్తుల్ని అలరించారు. వాయిద్య సహకారాన్ని రామకృష్ణ, షణ్ముఖశర్మ అందించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరండల్‌పేట 7వ లైనులో గుర్తు తెలియని సుమారు 65 సంవత్సరాల వృద్ధుడు మూడో తేదీన స్పృహ తప్పిపడి ఉన్నాడు. స్థానికులు అతడ్ని అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ నాలుగో తేదీన మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఐసీడీఎస్ విస్తరణతో మెరుగైన సేవలు

- మారిన ప్రత్తిపాడు ప్రాజెక్టు స్వరూపం
- మొన్నటి వరకూ మూడే మండలాలు
- పునర్విభజనతో నియోజకవర్గంలోని ఐదు మండలాలూ ఒక్క ప్రాజెక్టు పరిధిలోకి..



ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయం

ప్రత్తిపాడు: జిల్లాల పునర్విభజన తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో రీఆర్గనైజేషన్‌లో భాగంగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ (స్త్రీ, శిశు సంక్షేమ శాఖ) ప్రాజెక్టు స్వరూపం మారింది. ఇప్పటి వరకూ మూడు మండలాలకే పరిమితమైన ప్రాజెక్టు పరిధి ఇప్పుడు ఐదు మండలాలకు విస్తరించింది. నాలుగు ప్రాజెక్టుల పరిధిలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాలన్నీ ప్రత్తిపాడు ప్రాజెక్టు గొడుగు కిందకు చేరిపోయాయి.

ఇప్పటి వరకూ ఇలా..

ఇప్పటి వరకూ ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉండగా, కాకుమాను మండలం పొన్నూరు ప్రాజెక్టులో, గుంటూరు రూరల్ మండలం గుంటూరు అర్బన్, నల్లపాడు ప్రాజెక్టుల పరిధిలో ఉండేది. ఇకపై అన్ని మండలాలూ ప్రత్తిపాడు ప్రాజెక్టు పరిధిలోకి వచ్చేశాయి. దీంతో ఇప్పటి వరకు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 140 నుంచి 226కు చేరింది.

రీ ఆర్గనైజేషన్ తర్వాత మండలాల వారీగా కేంద్రాల సంఖ్య ఇలా..

మండలం	కేంద్రాలు	మినీ కేంద్రాలు
ప్రత్తిపాడు	47	01
వట్టిచెరుకూరు	44	02
కాకుమాను	58	-
గుంటూరు రూరల్	27	-
పెదనందిపాడు	47	-
మొత్తం	223	03

మరింత మెరుగైన పర్యవేక్షణ

ప్రాజెక్టు రీ ఆర్గనైజేషన్‌కు ముందు మూడు మండలాలకు గాను ఒక్కరే సీడీపీవో ఉండేవారు. అయితే, పాలన సౌకర్యవంతంగా ఉండటంతో పాటు, మెరుగైన పర్యవేక్షణ కేంద్రాలపై ఉండేందుకు వీలుగా ప్రత్తిపాడు ప్రాజెక్టుకు అడిషనల్ సీడీపీవోను నియమించారు. గుంటూరు చిల్డ్రన్ హోం సూపరింటెండెంట్‌గా చేస్తున్న సీహెచ్. విజయనిర్మలను గత నెలలోనే ప్రత్తిపాడు ప్రాజెక్టుకు కేటాయిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కేంద్రాలపై మరింత మెరుగైన పర్యవేక్షణ ఉండనుంది.

ప్రతి కేంద్రంపై సూక్ష్మపరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాల పునర్విభజన తరువాత కేంద్రాల కేంద్రాల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ అదనంగా ఏసీడీపీవోను కూడా కేటాయించడం వల్ల ప్రాజెక్టుల రిపోర్టులు తెప్పించుకోవడం, కేంద్రాల తనిఖీలు, పరిశీలనలు.. ఇలా ప్రతి విషయంలోనూ పర్యవేక్షణ ఎక్కువగా ఉండటంతో పాటు సౌకర్యవంతంగా ఉంటుంది. మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఉంటుంది. పోషకాహారలోపం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకుంటోంది.

– వి. సుజాతాదేవి (సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు)

రైతులకు అండగా ఉంటాం

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- గొడవర్రు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న జొన్న, మిర్చి పరిశీలన



గొడవర్రులో దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వ్యవసాయశాఖాధికారులు

గొడవర్రు(చేబ్రోలు): అకాల వర్షాలకు పంట దెబ్బతిని, నష్టపోయిన రైతులకు అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటామని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేబ్రోలు మండలంలో దెబ్బతిన్న పంట పొలాల్ని ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలోని గొడవర్రు, కొత్తరెడ్డిపాలెం గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన, దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, తెల్లజొన్న పంటల్ని పరిశీలించి రైతులకు భరోసా నిచ్చారు. రెండు రోజుల కిందట చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో 77మి.మీ. వర్షపాతం నమోదవ్వడంతో జొన్న, మిర్చి పంటలకు అపార నష్టం జరిగినట్లు రైతులు ఎమ్మెల్యేకి వివరించారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి రంగుమారి, నాణ్యత దెబ్బతినడంతో పూర్తిగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాయలు బూజుపట్టి, రంగు మారడంతో లక్షలాది రూపాయిల నష్టం జరిగిందని, ఆదుకోవాలని విన్నవించారు. దళితవాడ ప్రాంతంలో నీట నానుతున్న తెల్లజొన్న, మొక్కజొన్న పంటను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షపునీటిలో ఉన్న పంటను మెరక ప్రాంతానికి తరలించాలని రైతులకు సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రతి రైతుకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఉద్యాన, వ్యవసాయశాఖాధికారులు పంట దెబ్బతిని, నష్టపోయిన రైతుల వివరాల్ని నమోదు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించటంతో పాటు, అన్ని విధాలా చేదోడుగా ఉంటున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధైర్య పడవద్దని, పంటను ప్రభుత్వ మద్దతు ధరకన్నా తక్కువ ధరకు విక్రయించవద్దని ఆయన సూచించారు. అనంతరం కొత్తరెడ్డిపాలెంలో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, తెల్లజొన్న, మిర్చి పంటల్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. రెండు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పొన్నూరు ఏడీఏ సీహెచ్. తిరుమలాదేవి, హెచ్‌వో పి. ఉష, ఏవో బి. శ్రీనివాసనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా పాములు, చందు సాంబశివరావు, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, చుక్కా నాగేంద్రబాబు, చంద్రశేఖరరెడ్డి, ఆరాధ్యుల శ్రీనివాసరావు, తోట వీరభద్రయ్య, హుస్సేన్, కరీముల్లా, తుపాకుల శివయ్య, శివన్నారాయణ పాల్గొన్నారు.

ఐఏఎస్ సాధనకు కృషి, లక్ష్యం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసులకు హాజరయ్యే అభ్యర్థులకు కచ్చితమైన, స్పష్టమైన లక్ష్య సాధనతో కూడిన కృషి అవసరమని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో ఆదివారం కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ శిక్షణ తరగతుల్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయదలుచుకున్న అభ్యర్థులకు 21 ఏళ్ల నుంచి 32 ఏళ్లలోపు వయసుతోపాటు డిగ్రీ కనీస అర్హతగా ఉంటుందని చెప్పారు. ప్రిలిమ్స్‌లో జనరల్ స్టడీస్, సివిల్ సర్వీస్ ఆటిట్యూడ్ టెస్ట్ ద్వారా 400 మార్కులకు గాను కనీసం 50 శాతం స్కోరు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మెయిన్స్‌లో 50 శాతానికి పైగా మార్కులు సాధించినవారు ఇంటర్వ్యూ టెక్స్‌కు అర్హత సాధిస్తారని వివరించారు. అనంతరం ర్యాంకుల ఆధారంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్ వంటి కేడర్లకు ఎంపిక చేయబడతారని చెప్పారు. సన్ కార్యదర్శి సాయికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఐఆర్ఎస్ శిక్షణ పూర్తి చేసిన అశ్విన్ కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు టి.ఆర్. రమేష్, డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు

ఈశ్వర్ మృతదేహం లభ్యం



పెదనందిపాడు: నల్లమడ వాగులో శనివారం గల్లంతైన యువకుడు ఈశ్వర్ మృతదేహం ఆదివారం లభించింది. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వాగులో పాత వంతెన సమీపంలో గాలిస్తున్న సమయంలో మృతదేహం లభించినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాగు ఉధృతి ఎక్కువగా ఉందని, ఈతకు, చేపల వేటకు వెళ్లవద్దని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

జూదరుల అరెస్టు

గుంటూరు రూరల్: బుడంపాడు గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మంది జూదరుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 10 వేలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

శ్రావ్యంగా మధువని సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సుస్వరాల పల్లకి సంస్థ వ్యవస్థాపకులు వెలిశెల మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్వర రాగమాలికలు శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా అన్నదాన సమాజం చైర్మన్ పోకల వసంత్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పలు చిత్రాల్లోని సినీ పాటల్ని గాయకులు బి. భారతి, కె.శైలజ, మధుబాబు, సీహెచ్.రవికాంత్, ఎస్.సాంబశివరావు, సాయిబాబా ఆలపించారు.

ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య సేవలు శ్లాఘనీయం



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు శ్లాఘనీయమని బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ కొనియాడారు. గుంటూరు అంబేద్కర్ భవన్‌లో ఆదివారం దామోదరం సంజీవయ్య 52వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో సంజీవయ్య సేవా సంస్థ స్థాపించి తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సమస్యల్ని తీర్చారని తెలిపారు. దేశంలోనే అతి చిన్న వయసులో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి తొలి దళిత సీఎంగా, కేంద్ర మంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ఘనత దామోదరం సంజీవయ్యదని కొనియాడారు. వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టులైన గాజులదిన్నె, పులిచింతల, వంశధార ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి వాటి నిర్మాణానికి దోహదం చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా, లంచాలు ఇవ్వకుండా దేశంలోనే మొట్టమొదటిసారి ఏసీబీని స్థాపించిన ఘనత కూడా దామోదరం సంజీవయ్యకే దక్కుతుందని వివరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు



నాట్యం చేస్తున్న తెనాలి రంగనాయకి శిష్య బృందం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం అన్నమయ్య కళావేదికపై రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్ 25 వసంతాల వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు, తెనాలి, విజయవాడ, వరంగల్‌కు చెందిన వివిధ సంగీత, నృత్య కళాశాలల నిర్వహణలో 300 మంది సంగీత, నృత్య కళాకారులతో మూడు గంటల పాటు 300వ నెలనెలా వెన్నెల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు రాధామాధవ నాట్యక్షేత్రం నాట్యాచార్య షేక్ ఖలీల్, పూల భరణి నృత్య కళాశాల, నృత్య కళాభారతి ఎస్. బాలు శిష్య బృందం, తెనాలి గురువు బి. రంగనాయకి శిష్య బృందం, విజయవాడ కూచిపూడి డాన్స్ అకాడమీ తదితర కళాశాలల నిర్వహణలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు, భారతీదేవి సంగీత నిలయం గురువు భారతీదేవి శిష్య బృందం వీణా కచేరి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి రమేష్‌బాబు, ఆలయ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొని కళాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, అందించి సత్కరించారు. కార్యక్రమాన్ని నాట్యాచార్య షేక్ ఖలీల్ పర్యవేక్షించారు.

గర్భిణుల్లో ప్రొజెస్టెరాన్ హార్మోన్ ఆవశ్యకతపై అవగాహన



గుంటూరు మెడికల్: ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రీప్రొడక్షన్ (ఐఎస్ఏఆర్) ట్రావెలింగ్ సదస్సును ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముంబయికి చెందిన డాక్టర్ కేదార్ గన్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రొజెస్టరాన్ హార్మోన్ ఉపయోగాలు, గర్భిణుల్లో వాడే విధానం, అవసరం గురించి వివరించారు. ఐయూఐలో వస్తున్న ఆధునిక చికిత్సా విధానాలు, చేసిన తర్వాత రోగి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, స్టాండర్డ్ ప్రోటోకాల్స్ గురించి వివరించారు. సదస్సులో గైనకాలజీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ వి.పద్మజ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

పెదకాకాని: ఆటో కార్మికులంతా ఐకమత్యంతో ఉంటూ సమస్యల్ని పరిష్కరించుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ట్రాఫిక్ నిబంధనల్ని తప్పక పాటించాలని చెప్పారు. పెదకాకానిలో ఆదివారం ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో విధిగా కాకి చొక్కా ధరించాలని, లైసెన్సు, పర్మిట్, సీబుక్కులతో పాటు ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలని సూచించారు. సురక్షిత ప్రయాణమే ధ్యేయంగా ఆటోలు నడపాలని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా దుర్గం కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా గజ్జల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బొందలపాటి దేవదాసు, ఉపాధ్యక్షుడిగా నాదు సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా బుల్లా సురేష్, కోశాధికారిగా షేక్ బుడే, ఆఫీస్ బేరర్స్‌గా పాశం దర్గాబాబు, షేక్ వలి, ఎ. ఆంజనేయులు, ఎ. శ్రీనివాసరావు, కె. నాగరాజు, బి. దేవసహాయం, ఆనందరావు నియమితులయ్యారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

విద్యార్థులకు ఆర్జేడీ వి.ఎ.సుబ్బారావు సూచన



శిక్షణకు హాజరైన విద్యార్థులతో ఆర్‌జేడీ సుబ్బారావు, ఎస్‌వోసీ కమల్ కనన్ తదితరులు

చేబ్రోలు: విద్యార్థులు సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కోవాలని స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరక్టర్ (ఆర్జేడీ) వి.ఎ.సుబ్బారావు సూచించారు. స్థానిక ప్రెసిడెన్సీ హైస్కూలులో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపానం, రాజ్య పురస్కార్ ఐదు రోజుల శిక్షణలో భాగంగా నాలుగో రోజు ఆదివారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన రెండు వందల మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా విద్యార్థులు వెనుకడుగు వేయకుండా, ధైర్యంగా ముందుకు సాగి తోటి వారికి సహాయపడటమే స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. తమిళనాడుకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్‌వోసీ కమల్ కనన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా దృక్పథం కలిగి, తోటి వారికి ఉపయోగపడాలని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల క్రమశిక్షణ, అంకితభావం, ఐకమత్యం, సత్ప్రవర్తన లక్షణాలు అలవడుతాయని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ జాయింట్ డైరెక్టర్ డీఆర్‌కే శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు, తోటి వారికి సహాయపడాలని సూచించారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్‌జేడీతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు మెమెంటోలు అందజేసి అభినందించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి బస్ బాబు, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, అసోసియేషన్ సెక్రటరీ డి.ఎల్. నారాయణ, ప్రిన్సిపాల్ ఆశాలత, వివిధ ప్రాంతాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

పెదకాకాని మండలంలో 61.60 శాతం ఉత్తీర్ణత

పెదకాకాని: పది ఫలితాల్లో మండలంలోని ఏడు జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. 638 మంది పరీక్షలు రాయగా 393 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 61.60 శాతం ఉత్తీర్ణత లభించింది. నంబూరు జెడ్పీహెచ్ నుంచి 121 మందికి గానూ 77 మంది ఉత్తీర్ణులై 63.64 శాతం, నంబూరు జెడ్పీహెచ్ బాలికల పాఠశాల నుంచి 29 మందికి గానూ 18 మంది ఉత్తీర్ణులై 62.07, పెదకాకాని జెడ్పీహెచ్ నుంచి 183 మందికి గానూ 94 మంది ఉత్తీర్ణులై 51.37 శాతం లభించింది. ఉప్పలపాడు హైస్కూలు నుంచి 50 మందికి గానూ 36 మంది ఉత్తీర్ణులై 72 శాతం, తక్కెళ్లపాడు హైస్కూలు నుంచి 51 మందికి గానూ 36 మంది పాసై 70.59 శాతం, వెనిగండ్ల హైస్కూలు నుంచి 141 మందికి గానూ 90 మంది ఉత్తీర్ణులై 63.83 శాతం, కొప్పురావూరు హైస్కూలు నుంచి 63 మందికి గానూ 42 మంది ఉత్తీర్ణులై 66.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఎస్. వెంకటశ్రీనాగలక్ష్మి హిమజ 577 మార్కులతో ప్రథమ స్థానంలో, పెదకాకాని జెడ్పీహెచ్‌కి చెందిన ఎస్.కె.డి. మహ్మద్ కైఫ్ 574 మార్కులతో ద్వితీయ స్థానం, కొప్పురావూరు హైస్కూలుకు చెందిన కారంకి బాలాజీ 568 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. నంబూరు జెడ్పీహెచ్ నుంచి 554 మార్కులతో షాహెద్ బేగం, ఉప్పలపాడు జెడ్పీహెచ్ నుంచి 550 మార్కులతో ప్రేమ్‌కుమార్, తక్కెళ్లపాడు జెడ్పీహెచ్ నుంచి 537 మార్కులతో ఫరీద్, నంబూరు బాలికల పాఠశాల నుంచి 497 మార్కులతో మాధవి స్కూల్ ఫస్ట్ సాధించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థుల్ని ఎంఈవో డి. బలిరాం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఘనంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పించిన రామచంద్రరాజు, లక్ష్మీనారాయణ తదితరులు

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ది ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పెనుమత్స రామచంద్రరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.వి.ఎస్ లక్ష్మీనారాయణ, సభ్యులు రవి శ్రీనివాస్, మేనేజర్ గాంధీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జాని రసూల్, బాబు, శివయ్య, పాల్గొన్నారు. ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- లక్ష్మీపురంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి నిర్వహించారు. పార్టీ మైనార్టీ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు జమీల్ అహ్మద్ బేగ్ ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుర్గా శ్రీనివాస్, అమరేష్, ఆశ్రిత్ పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి తీర్మానంపై హర్షం

నెహ్రూనగర్: జీసస్ క్రైస్ట్, జఫర్సన్, మోషే, అబ్రహాం లింకన్ వంటి మహనీయులతో అంబేడ్కర్‌ను పోల్చుతూ, ప్రపంచ విమోచకుడిగా గుర్తిస్తూ జై భీమ్ అనే నినాదంపై ఐక్యరాజ్యసమితిలోని 204 సభ్యత్వ దేశాలు గత ఫిబ్రవరిలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని ఐడియా (ఐడియల్ దళిత్ ఎంప్లాయీస్ అసోసియేషన్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిన అంశంపై అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం పెదగొట్టిపాడు, పెదమక్కెన, అంబేడ్కర్ ఐద్వా మహానగర్‌లకు చెందిన దళితులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఐక్యరాజ్యసమితి ప్రపంచ విమోచకుడిగా గుర్తించడంతో పాటు జై భీమ్ అనే నినాదాన్ని ముక్తకంఠంతో పలకడం భారతదేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. పార్లమెంటుతో పాటు దేశంలోని అన్ని రాష్ట్ర శాసన సభలు హర్షం వ్యక్తం చేస్తూ చేసిన తీర్మానాల్ని ఐక్యరాజ్య సమితికి పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జొన్నలగడ్డ ప్రభాకర్, పిల్లి శ్యాంసన్, కుమ్మరిగుంట చార్లెస్ పాల్గొన్నారు.